bi
నమస్తే తెలంగాణ

# వికారాబాద్

I హైదరాబాద్, ఆదివారం 3 నవంబర్ 2024 VIKARABAD


బీఆర్ఎస్ హయాంలో రంగారెడ్డి జిల్లా పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి సాధించింది. అదే ఊపులో జిల్లాకు పెద్దఎత్తున పరిశ్రమలు తరలి రావడంతో అప్పటి పాలకులు అనేక ప్రతిపాదనలను సిద్ధం చేసి వాటి కోసం స్థలాలను గుర్తించారు. మరికొన్ని చోట్ల భూసేకరణ కూడా చేపట్టారు. కానీ, అసెంబ్లీ ఎన్నికలు వచ్చి ప్రభుత్వం మారడంతో గతంలో చేసిన ప్రతిపాదనలను రేవంత్‌రెడ్డి సర్కారు పట్టించుకోవడంలేదు. దీంతో జిల్లాకు రావాల్సిన అనేక పరిశ్రమలు అర్ధాంతరంగా ఆగిపోయాయి. బీఆర్ఎస్ హయాంలో జిల్లాలోని ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాలు పారిశ్రామికంగా ఎంతో పురోగతి సాధించాయి. ముఖ్యంగా ఫాక్స్‌కాన్, కెయిమ్స్, ఫ్యాబ్‌సిటీతోపాటు అనేక పరిశ్రమలు జిల్లాలో ఏర్పాటయ్యాయి. పెట్టుబడుల కోసం అప్పట్లో పారిశ్రామికవేత్తలు క్యూ కట్టారు.

-రంగారెడ్డి, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ)

## బీఆర్ఎస్ హయాంలో చేసిన ప్రతిపాదనలను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

# పారిశ్రామిక ప్రగతిపై నీలినీడలు

- అర్ధాంతరంగా నిలిచిపోయిన పరిశ్రమల రాక
- ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌పై దృష్టి సారించని సర్కారు
- నిరుద్యోగుల ఆశలు ఆవిరి

జిల్లాలో పెట్టుబడుల కోసం పెద్ద ఎత్తున పరిశ్రమలు రావడంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం వాటి కోసం భూములను గుర్తించింది. అందులో కొన్ని భూములకు పరిహారాన్ని కూడా చెల్లించి టీఎస్ఐఐసీకి అప్పగించింది. కానీ, ప్రభుత్వం మారిన తర్వాత ఆ ప్రతిపాదనలన్నీ బుట్ట దాఖలయ్యాయి. తమ ప్రాంతానికి పరిశ్రమలొస్తే తమకు ఉద్యోగావకాశాలు రావడంతోపాటు భూముల ధరలూ గణనీయంగా పెరుగుతాయని, సమీప గ్రామాలు అభివృద్ధి సాధిస్తాయని చాలామంది రైతులు భావించి తమ పంట పొలాలను ఇచ్చేందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. దీంతో జిల్లాలో ఓఆర్ఆర్, ఐటీ, ఏరోస్పేస్‌తోపాటు పలు పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. అలాగే, కలెక్టరేట్ ఇబ్రహీంపట్నం ప్రాంతంలో ఏర్పాటు కావడంతో అభివృద్ధి పరంగా ఇబ్రహీంపట్నం మరింత ముందున్నది. ఇదే ఊపులో జిల్లాలోని భూముల ధరలు ఆకాశాన్నంటాయి. జిల్లాలో హెచ్ఎండీఏ పరిధిలో సుమారు 13 మండలాలున్నాయి. ఈ మండలాలతోపాటు మరో మూడు కార్పొరేషన్లూ ఉన్నాయి. ఇబ్రహీంపట్నం, పెద్దఅంబర్‌పేట్, అబ్దుల్లాపూర్‌మెట్, తుక్కుగూడ, ఆదిబట్ల, తుర్కయాంజాల్, శంషాబాద్, రాజేంద్రనగర్, గండిపేట వంటి ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావడంతో.. పారిశ్రామిక ప్రగతి పుంజుకుని భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. ప్రభుత్వం మారడంతో ఒక్కసారిగా ప్రగతికి బ్రేకులు పడ్డాయి.



పూర్తయిన ఫాక్స్‌కాన్ మొదటి దశ పనులు

### ఫార్మాసిటీ ఉంటుందా..? ఉండదా..?

కందుకూరు, యాచారం మండలాల్లో సుమారు 19,000 ఎకరాలను ఫార్మాసిటీ ఏర్పాటు కోసం గత ప్రభుత్వం సేకరించింది. పర్యావరణ అనుమతులు కూడా లభించాయి. కానీ, ప్రభుత్వం మారిన తర్వాత ఫార్మాపై స్పష్టమైన ప్రకటన రావడం లేదు. మరోవైపు ఫార్మాసిటీ సమీపంలోనే ఫోర్త్ సిటీని ఏర్పాటు చేయాలని రేవంత్ ప్రభుత్వం నిర్ణయించడంతో ఫార్మాసిటీ ఏర్పాటవుతుందా..? లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

### ఎలిమినేడులో ఏరోస్పేస్ ఏర్పడేనా..?

ఇబ్రహీంపట్నం మండలంలోని ఎలిమినేడు గ్రామంలో టాటా అనుబంధమైన ఏరోస్పేస్ ఏర్పాటుకు గత ప్రభుత్వం బీజం వేసింది. ఈ గ్రామంలోనే మహేంద్ర కంపెనీ ఏర్పాటుకు కూడా ఆ సంస్థ ముందుకు రాగా..రైతులు ఆశించిన పరిహారం ఇచ్చి ఆ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని టీఎస్ఐఐసీకి అప్పగించింది. పరిశ్రమల ఏర్పాటుకు అంతా సిద్ధం కాగా.. ఆ సమయంలో ప్రభుత్వం మారడంతో ఆ ప్రక్రియ అక్కడితో ఆగిపోయింది. ఎలిమినేడుకు ఏరోస్పేస్ సంస్థ వస్తే నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని ఆశించిన వారి ఆశలపై నీల్లు చల్లినట్లయ్యింది. ఈ గ్రామానికి ఏరోస్పేస్, మహేంద్ర సంస్థలు వస్తాయా..? రావా..? అనేది ప్రశ్నార్థకంగా మారింది.

### నిరుద్యోగులకు వరం ఫాక్స్‌కాన్

మాజీ సీఎం కేసీఆర్ పట్టుబట్టి తీసుకొచ్చిన ఫాక్స్‌కాన్ కంపెనీ ఈ ప్రాంత నిరుద్యోగులకు వరంగా మారింది. గతేడాది మే 9న ఈ కంపెనీ తన పనులను ప్రారంభించింది. మార్చి నాటికి మొదటి దశ పూర్తి కావాల్సి ఉండగా ప్రభుత్వం మారడంతో పనుల్లో కొంత జాప్యం జరిగింది. అయినప్పటికీ ఆ కంపెనీ ప్రతినిధులు శరవేగంగా పనులు చేపడుతున్నారు. మరో నెల రోజుల్లో మొదటి దశ పనులను పూర్తిచేసి ప్రొడక్ట్‌ను ప్రారంభించాలని నిర్ణయించారు. ఇందుకోసం మొదటి దశలో 25వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో ఆ కంపెనీ ప్రతినిధులు ఇబ్రహీంపట్నం, మహేశ్వరం సెగ్మెంట్లలో పదోతరగతి, ఇంటర్, డిగ్రీ పూర్తిచేసిన వారిని ఎంపిక చేసి నైపుణ్య శిక్షణ ఇప్పించి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే ఆయా మున్సిపాలిటీలు, మండలాల్లో ఉద్యోగమేళాలూ నిర్వహించారు. రూ.450 కోట్లతో ఫాక్స్‌కాన్ కంపెనీని ఏర్పాటు చేశారు.

### పరిశ్రమలు ఏర్పాటు చేయాలి



బీఆర్ఎస్ హయాంలో మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఏరోస్పేస్‌తోపాటు మరిన్ని సంస్థలను ఎలిమినేడు గ్రామానికి తీసుకొచ్చారు. ఆ సమయంలోనే ప్రభుత్వం మారడంతో ఆ ప్రక్రియ ఆగిపోయింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పరిశ్రమలను ఏర్పాటు చేసిన నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలి

- మంచిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, మాజీ వైస్ఎంపీపీ, ఇబ్రహీంపట్నం

### పరిశ్రమల ఏర్పాటును పట్టించుకోని సర్కార్

అభివృద్ధిలో వెనుకబడిన మంచాల మండలంలోని తాళ్లపల్లిగూడలో పరిశ్రమల ఏర్పాటు కోసం 400 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించి.. అక్కడ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వం భావించగా.. ప్రస్తుత సర్కారు దానిపై దృష్టి సారించడం లేదు. అలాగే, యాచారం మండలంలోని మొండిగౌరెల్లిలోనూ పారిశ్రామికవాడ ఏర్పాటు కోసం అప్పట్లోనే 400 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించి సర్వేకూడా చేశారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని తారామతిపేటలో రెండు వందల ఎకరాల ప్రభుత్వ భూమిని పరిశ్రమల కోసం గుర్తించి కేసీఆర్ ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసినా.. ప్రభుత్వం మారడంతో అవి అన్నీ బుట్టదాఖలయ్యాయి. కందుకూరు, మహేశ్వరం, కడ్తాల్, ఆమనగల్లు, తలకొండపల్లి వంటి మండలాల్లోనూ సర్కారు చేయిచ్చింది.

### ఫాక్స్‌కాన్‌తో నిరుద్యోగ యువతకు ఉపాధి



బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫాక్స్‌కాన్ కంపెనీతో చాలామంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు లభించాయి. మరిన్ని ఉద్యోగాల భర్తీకోసం ఆ కంపెనీ గ్రామాల్లో నిరుద్యోగ యువత కోసం జాబ్ మేళాలు నిర్వహిస్తున్నది. ఈ ప్రాంతంలో ఫాక్స్‌కాన్ కంపెనీ ఏర్పాటుకు కృషిచేసిన మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు.

- మడుపు శివసాయి

# ఇంకా పాత పింఛన్లే..

## కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలెప్పుడో..?



- అధికారంలోకి వచ్చి 11 నెలలు దాటుతున్నా..ఆసరా పింఛన్ల పెంపుపై ప్రకటనే లేదు
- ఆశగా ఎదురుచూస్తున్న లబ్ధిదారులు
- రేవంత్ సర్కార్ వచ్చిన నాటి నుంచి పంపిణీలో జాప్యం
- ఇంకా పూర్తికాని సెప్టెంబర్ నెల పంపిణీ
- మండిపడుతున్న లబ్ధిదారులు

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 11 నెలలు దాటుతున్నా.. ఆసరా పింఛన్లను పెంచకపోవడంతో లబ్ధిదారులు ఎప్పుడు పెంచుతారా.. అని ఆశగా ఎదురుచూస్తున్నారు. తాము అధికారంలోకి రాగానే వృద్ధులు, వితంతువులు తదితరులకిచ్చే రూ.2,016 పింఛన్‌ను రూ.4,000, దివ్యాంగుల పింఛన్‌ను రూ.6,000 పెంచుతామని అసెంబ్లీ ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పవర్‌లోకి రాగానే ఆ మాటను మరిచిపోయారు. లబ్ధిదారులకు ఇప్పటికీ కేసీఆర్ హయాంలో అందిన మొత్తమే పంపిణీ అవుతుండడంతో రేవంత్ ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ప్రతినెలా పింఛన్ల పంపిణీలోనూ జాప్యం జరుగుతున్నదని, సెప్టెంబర్ నెలకు సంబంధించిన పింఛన్లను నవంబర్ నెలలో ఇస్తున్నారని.. ఇలా ఇస్తే తాము ఎలా బతకాలని పండుటాకులు, దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

-వికారాబాద్, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ)

రేవంత్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలు దాటుతున్నా పేదలకు ఇచ్చిన హామీలు మాత్రం అమలుకు నోచుకోవడం లేదు. కేవలం ఆరు గ్యారెంటీలకు సంబంధించినవే ప్రస్తావిస్తూ మిగిలిన వాటి ఊసే ఎత్తడం లేదు. తాము అధికారంలోకి రాగానే వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు తదితరులకిచ్చే ఆసరా పింఛన్లను రూ.2,016 నుంచి రూ.4,000, దివ్యాంగులకు ఇచ్చే రూ.4,016 పింఛన్‌ను రూ.6,000 పెంచుతామని హామీ ఇవ్వగా.. వారి మాటలు నమ్మిన ప్రజలు ఓటేసి గెలిపించారు. హస్తం పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది కావొస్తున్నా పింఛన్ల పెంపు లేకపోవడంతో లబ్ధిదారులు ఎప్పుడు పెరుగుతుందా అని ఆశగా ఎదురు చూస్తున్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు ఎక్కడికెళ్లినా పింఛన్ల పెంపుపై ప్రజలు నిలదీస్తున్నారు. ఇప్పటికీ పాత పింఛన్ డబ్బులనే పంపిణీ చేస్తుండడం గమనార్హం. బీఆర్ఎస్ హయాంలో ప్రతినెలా మొదటి వారంలోగా ఆసరా లబ్ధిదారులకు పింఛన్ డబ్బులను పంపిణీ చేయగా.. ప్రస్తుతం 40 రోజులు ఆలస్యంగా డబ్బులు అందుతున్నాయని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా ఆరు గ్యారెంటీల అమలుకు తెల్లరేషన్ కార్డును తప్పనిసరి చేయడంతో చాలామంది పేదలకు పథకాల ఫలాలు అందడం లేదు. రైతుల నుంచి మొదలుకొని అన్ని వర్గాలకు హామీలిచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమల్లో విఫలమైందని మండిపడుతున్నారు.

### దేశంలో ఎక్కడా లేని విధంగా..

వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులను ఆదుకునేందుకు కేసీఆర్ ప్రభుత్వం ఆసరా పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చి.. దేశంలో ఎక్కడాలేని విధంగా పింఛన్ డబ్బులను పెంచింది. వృద్ధులు, వితంతువులు తదితరులకిచ్చే రూ.200 పింఛన్‌ను రూ.1,000, దివ్యాంగులకు ఇచ్చే రూ.500 పింఛన్‌ను రూ.1,500, రెండోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఆసరా పింఛన్లను రూ.1,000 నుంచి రూ.2,016, దివ్యాంగుల పింఛన్లను రూ.1,500 నుంచి రూ. 3016కు.. తదనంతరం దివ్యాంగులకు ఇచ్చిన హామీ మేరకు గతేడాది జూన్‌లో దివ్యాంగుల పింఛన్‌ను రూ.4,016లకు పెంచి పేదల ప్రభుత్వంగా బీఆర్ఎస్ ప్రభుత్వం నిలిచింది. బీఆర్ఎస్ హయాంలో జిల్లాలో పింఛన్లకోసం రూ.1,100 కోట్లకుపైగా ఖర్చు చేసింది. అంతేకాకుండా ఉమ్మడి రాష్ట్రంలో పింఛన్ల నిమిత్తం అప్పటి ప్రభుత్వాలు నెలకు కేవలం రూ.2 కోట్లు ఖర్చు చేయగా బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం మొదట నెలకు రూ.12కోట్ల మేర ఖర్చు చేయగా.. తదనంతరం పింఛన్ డబ్బులు రెట్టింపు కావడంతో నెలకు రూ.26 కోట్ల మేర వెచ్చించింది.

### పింఛన్ల పంపిణీలో జాప్యం..

ఆసరా పింఛన్‌తోనే బతుకుతున్న పండుటాకులు, దివ్యాంగులకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన మొదటి నెల నుంచే అవస్థలు మొదలయ్యాయి. ప్రతినెలా పింఛన్ల పంపిణీలో జాప్యం జరుగుతున్నది. జిల్లాలోని వికారాబాద్, తాండూరు, పరిగి నియోజకవర్గాల్లోని లబ్ధిదారులకు పింఛన్ డబ్బుల పంపిణీ ప్రతినెలా 29 లేదా 30న ప్రారంభమై వారం రోజుల్లో పూర్తవుతుండగా.. కొడంగల్ సెగ్మెంట్‌లోని పింఛన్‌దారులు మాత్రం డబ్బుల కోసం మొదటి వారం పూర్తయ్యే వరకు ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొన్నది. బీఆర్ఎస్ హయాంలో ప్రతినెలా మొదటి వారంలోగా పింఛన్లను అందజేయగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన మొదటి నెల నుంచే ఆసరా పింఛన్ల పంపిణీ ఆలస్యంగా జరుగుతుండడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్టోబర్ మొదటి వారంలో అందాల్సిన సెప్టెంబర్ నెల పింఛన్ డబ్బులు నవంబర్ మొదటి వారంలో పంపిణీ చేస్తుండడంపై లబ్ధిదారులు ప్రభుత్వంపై మండిపడుతున్నారు. అయితే కొడంగల్ నియోజకవర్గానికి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి ఆసరా పింఛన్ల నిమిత్తం నిధులు మంజూరు అవుతుండగా.. వికారాబాద్, తాండూరు, పరిగి నియోజకవర్గాలకు రంగారెడ్డి జిల్లా నుంచి వస్తున్నాయి. కాగా జిల్లాలో 98,793 మంది పింఛన్‌దారులుండగా వారికి ప్రతినెలా రూ.24,38 కోట్ల పింఛన్ డబ్బులను పంపిణీ చేస్తున్నారు.

### రూ. నాలుగు వేల పింఛన్ రావడం లేదు



కేసీఆర్ ప్రభుత్వంలో వచ్చినట్లుగానే ప్రతినెలా రూ.2,016 పింఛన్ వస్తున్నది. అది కూడా సక్రమంగా రావడం లేదు. ఎన్నికల్లో విజయం సాధించగానే ఆసరా పింఛన్‌ను రూ.నాలుగు వేలకు పెంచి ఇస్తామని గొప్పలు చెప్పి, ఓట్లు వేయించుకుని కాంగ్రెస్ నాయకులు మోసం చేశారు. ఆ ప్రభుత్వం ఏర్పడి దాదాపుగా 11 నెలలు దాటుతున్నా ఇప్పటివరకు రూ.నాలుగు వేల పింఛన్ రావడం లేదు. చేత కాకుంటే హామీలు ఇవ్వొద్దు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పింఛన్ కరెక్టు టైంకు వచ్చేది. సీఎంగా కేసీఆర్ ఉంటేనే రాష్ట్రంలోని అందరికీ మంచి జరుగుతుంది.

-జుబేదాబి, కోటమర్పల్లి, మర్పల్లి

### హామీల అమల్లో రేవంత్ సర్కార్ విఫలం



ప్రజలకు మాయమాటలు చెప్పి, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. హామీల అమల్లో రేవంత్ సర్కార్ విఫలమైనది. ఎన్నికల్లో విజయం సాధించగానే ఆసరా పింఛన్‌ను రూ. నాలుగు వేలకు పెంచి ఇస్తామని చెప్పి.. ఇప్పటికీ పంపిణీ చేయడంలేదు. చేత కాకుంటే హామీలు ఇవ్వొద్దు.

-పలమంటి నర్సింహులు, కోటమర్పల్లి, మర్పల్లి

# స్కిల్ వర్సిటీ వరకు మెట్రో

## 24,269 కోట్లు 76.4 కి.మీలు

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌గా మెట్రో 2.0
- ప్రాజెక్టు నిర్మాణానికి పరిపాలనా అనుమతులు
- జీవో నంబర్ 196 జారీ



సిటీబ్యూరో, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ మహానగరంలో రెండో దశ మెట్రో ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి జాయింట్ వెంచర్‌గా చేపట్టనున్నట్లు తెలంగాణ సర్కారు వెల్లడించింది. దీనికి సంబంధించి రాష్ట్ర పురపాలక శాఖ మెట్రో ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన పరిపాలనా అనుమతులు ఇస్తున్నట్లు జీవో ఎంఎస్. నంబర్ 196ను శనివారం జారీ చేసింది. నగరం విస్తరిస్తున్న కొద్దీ ట్రాఫిక్ రద్దీ పెరుగుతుండడంతో ఇప్పుడున్న మెట్రోను ఇతర మార్గాలకు విస్తరించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. అందుకు సంబంధించిన డీపీఆర్‌లకు వారం రోజుల కిందటే రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రెండో దశలో 5 మార్గాల్లో మొత్తం 76.4 కిలోమీటర్ల మేర నిర్మించే ప్రాజెక్టు మొత్తం అంచనా వ్యయం రూ.24,269 కోట్లు అవుతుందని అంచనా వేశారు. అందులో 30శాతం రూ.7313 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం, 18 శాతం రూ.4,230 కోట్లు కేంద్ర ప్రభుత్వం వెచ్చించాల్సి ఉంటుంది. అదేవిధంగా జైకా, ఏబీడీ, ఎన్‌డీబీ సంస్థల నుంచి 48% చొప్పున అప్పుగా రూ.11,693 కోట్లు, మిగతా 4 శాతమైన రూ.1033 కోట్లను పీపీపీ విధానంలో వెచ్చించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. దీనికి సంబంధించి ఆర్థిక శాఖ నుంచి అనుమతులు వచ్చాయి.

### మొదటి దశకు విశేష ఆదరణ..

నగరంలో మెట్రో మొదటి దశకు ప్రయాణికుల నుంచి విశేష ఆదరణ ఉన్నదని, ప్రతిరోజూ 5లక్షలకు పైగా ప్రయాణికులు మెట్రోలో రాకపోకలు సాగిస్తున్నారని ప్రభుత్వం పేర్కొన్నది. నగరం ఇరువైపులా విస్తరిస్తున్న నేపథ్యంలో మొదటి దశకు అనుసంధానంగా మరో ఆరు కారిడార్లను నిర్మించనున్నారు. మొదటి దశ మెట్రోను పూర్తిగా పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో రూ. 22 వేల కోట్ల వ్యయంతో నిర్మించగా, ఇది ప్రపంచంలో అతి పెద్ద పీపీపీ మెట్రో ప్రాజెక్టుగా నిలిచింది. నగరంలో వాయు కాలుష్యం నివారించడంతో పాటు అత్యాధునిక ప్రజా రవాణా వ్యవస్థగా మెట్రో రైలు అవసరమని గుర్తించి రెండోదశను మొత్తం 116.4 కి.మీ మేర నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పార్ట్-ఏలో 76.4 కి.మీ, పార్ట్-బీలో 40 కి.మీ దూరంతో రెండో దశ నిర్మాణానికి ప్రభుత్వం ముందుకు వెళ్లనున్నదని జీవోలో పేర్కొన్నారు.

### రెండో దశలో నిర్మించే మెట్రో మార్గాలు..

- కారిడార్-4 నాగోల్ -శంషాబాద్ ఎయిర్‌పోర్టు 36.8 కి.మీ.( ఎయిర్‌పోర్టు కారిడార్)
- కారిడార్-5 రాయదుర్గం-కోకాపేట నియోపొలీస్-11.6 కి.మీ
- కారిడార్-6 ఎంజీబీఎస్- చాంద్రాయణగుట్ట- 7.5 కి.మీ( ఓల్డ్ సిటీ కారిడార్)
- కారిడార్-7 మియాపూర్- పటాన్‌చెరు 13.4 కి.మీ
- కారిడార్-8 ఎల్‌బీనగర్ - హయత్‌నగర్ 7.1 కి.మీ

★ రెండో దశ పార్ట్-ఏలో నిర్మించే మొత్తం దూరం 76.4 కి.మీ

★ రెండో దశ పార్ట్-బీలో నిర్మించే మొత్తం 40 కి.మీతో కలిపి మొత్తం మెట్రో రెండో దశ కారిడార్ల దూరం 116.4 కి.మీ.

కారిడార్-9 శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఫోర్త్ సిటీలోని స్కిల్ వర్సిటీ వరకు 40 కి.మీ

### కారిడార్-9గా ఫోర్త్ సిటీ మెట్రో...

రేవంత్ సర్కార్ ప్రకటించిన ఫోర్త్‌సిటీ కోసం మెట్రో కారిడార్ నిర్మాణానికి హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ ప్రతిపాదనలు రూపొందిస్తున్నది. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఓఆర్ఆర్ మీదుగా కొంగరకలాన్ నుంచి స్కిల్ యూనివర్సిటీ వరకు 40 కి.మీ దూరంతో నిర్మించేందుకు డీపీఆర్‌ను కూడా సిద్ధం చేస్తున్నారు. కారిడార్-9గా నిర్మిస్తున్న ఫోర్త్‌సిటీ మెట్రో మార్గానికి ప్రభుత్వం పరిపాలనా అనుమతులు ఇచ్చింది. దీనికి సంబంధించి అలైన్‌మెంట్, ఇతర ఫీచర్లు, ప్రాజెక్టు నిర్మాణ వ్యయంపై మెట్రో అధికారులు అంచనాలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

### పెట్టుబడి డబుల్ అవుతుందంటే..

బంజారాహిల్స్, నవంబర్ 2 : ఆన్‌లైన్‌లో వచ్చిన ఓ లింక్ ద్వారా పెట్టుబడి డబుల్ అవుతుందని నమ్మి ఓ వ్యక్తి డబ్బులు చెల్లించి మోసపోయాడు. ఈ ఘటన బంజారాహిల్స్ ఠాణా పరిధిలో జరిగింది. రోడ్ నం.5లోని దేవరకొండ బస్తీలో ఉంటున్న పవన్‌కుమార్ అనే కాంట్రాక్టర్‌కు రెండునెలల కిందట వాట్సాప్‌లో గుర్తు తెలియని నంబర్‌నుంచి ఒక లింక్ వచ్చింది. దానిని ఓపెన్ చేయగానే సర్వర్ అనే ప్రొడక్ట్‌ను కొంటే పెట్టిన పెట్టుబడి డబుల్ అవుతుందని మెసేజ్ వచ్చింది. నమ్మిన పవన్‌కుమార్ రూ.18,500 పెట్టాడు. మరో పదిరోజుల తర్వాత మరో రూ.12,300 చెల్లించాడు. అయితే రోజులు గడిచినా పెట్టుబడి డబుల్ కాకపోవడంతోపాటు తన వ్యాలెట్‌లో కనిపించిన డబ్బులు కూడా బ్లాక్ అవ్వడంతో మోసపోయినట్లు గుర్తించిన అతడు శనివారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ఓటీఎస్ గడువు 30 వరకు..

సిటీబ్యూరో, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ): ఓటీఎస్ 2024 గడువును ఈ నెల 30వ తేదీ వరకు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. పథకం గడువును పెంచాలని వినియోగదారుల నుంచి అధికంగా విజ్ఞప్తులు రావడంతో జలమండలి ప్రభుత్వానికి లేఖ రాసిందని ఈ మేరకు ఓటీఎస్ గడువును ప్రభుత్వం మరోసారి పెంచిందని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జలమండలిలో ఓటీఎస్ 2024 పథకం ద్వారా అక్టోబర్ 31 వరకు రూ.49 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ సమయంలో దాదాపు 70,335 మంది వినియోగదారులు ఈ పథకాన్ని వినియోగించుకున్నారు. నగరంలో దీర్ఘకాలికంగా పేరుకుపోయిన నల్లా కనెక్షన్ బిల్లులను వసూలు చేసేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది.

# అరుణాచల గిరి ప్రదక్షిణ.. పంచారామాలకు ప్రత్యేక బస్సులు



సుల్తాన్‌బజార్, నవంబర్ 2: కార్తిక మాసాన్ని పురస్కరించుకొని అరుణాచల గిరి ప్రదక్షిణ, పంచారామాల దర్శనానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం టీజీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు రంగారెడ్డి రీజియన్ రీజినల్ మేనేజర్ శ్రీలత శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 13న ఎంజీబీఎస్, బీహెచ్ఈఎల్ నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్సులు ప్రారంభమవుతాయని ఆమె వివరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూరు జిల్లా కాణిపాకం, వెల్లూరులోని శ్రీ నారాయణి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్న అనంతరం 16న తిరిగి ప్రత్యేక బస్సులు హైదరాబాద్‌కు చేరుకుంటాయని చెప్పారు. కార్తిక పౌర్ణమి సందర్భంగా అరుణాచలం గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ స్పెషల్ బస్సుల టికెట్ బుకింగ్ కోసం www.tgsrtconline.in లో లేదా టీజీఎస్ఆర్టీసీ అన్ని కౌంటర్లలో బుక్ చేసుకోవాలన్నారు. ఈ నెల 13న పటాన్‌చెరు, రామచంద్రాపురం, బీహెచ్ఈఎల్, మియాపూర్, కేపీహెచ్‌బీ, అమీర్‌పేట, ఎంజీబీఎస్, జేబీఎస్ ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు వివరించారు. అరుణాచలం వెళ్లే భక్తులు బీహెచ్ఈఎల్ నుంచి సూపర్ లగ్జరీ రూ. 4,000, రాజధాని రూ. 5,360, ఎంజీబీఎస్ నుంచి సూపర్ లగ్జరీ రూ. 3,900, రాజధాని రూ.5,230 టికెట్ చార్జీలను నిర్ణయించినట్లు చెప్పారు. మరింత సమాచారం కోసం 9959226149, 9959226153, 9959226249, 9959226250 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. అంతేకాకుండా ప్రతి ఆదివారం పంచారామాల ప్రత్యేక ప్యాకేజీని మియాపూర్ డిపో-1 నుంచి అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ నెల 3న, 10న, 17న, 24వ తేదీల్లో పంచారామాలైన అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోటలోని శివాలయాలకు ప్రతి సోమవారం రాత్రి పది గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12 గంటలకు తిరిగి మియాపూర్ డిపో-1కు బస్సులు చేరుకుంటాయన్నారు.